"ఏమిట్రా ! ఉన్న కొద్దీ మతిపోతుంది నీక" ని అడిగితే అంటాడు—" మీరు మొన్నను అమ్మతో-'పేక్కప్పలో తుపాను ' అన్నారుకదూ ! అంటె అమ్మను—' మన కప్పు పేకు వాసమా కొడికె వాసమా ' అని యడిగాను. యడిగితే—' పేకు వాసమే ' అంది. మతి పేక్కప్పవుతే యందులో తుపాను పడుతుందేమోనని తెగ్గోసేస్తున్నాను " అన్నాడు వాడు.

"అవును టే!" అని యడిగాను దాన్ని. " ఆఁ ! మీరన్న మాట నిజం ! వాడడిగిన మాట నిజం ! కాని నేను మాత్రం వాసం కోసెయ్య మనలే " దంది. " ఓసి ! తిన్నింటివాసాలు లెక్కేసేవాళ్ళే కాకుండా తెగ్గోసే వాళ్లుకూడా అయినార్రా మీరిద్దరూను. నేను—' టీకప్పులో తుపాన ' ని అన్నానుగాని— 'పేకప్పులో తుపాన ' ని కాదు. అని అంటూ నాకు నేనే బుద్ధి చెప్పుకున్నాను. ' అప్రాచ్యుణ్ణి నేనే ' అని యనుకుంటూ. కాకపోతే పాశ్చాత్యసామెత నీ భారత ఖండంలో నేను నొక్కి-వక్కాణించడం ఏమిటి ? అందులోను వాళ్ళముందు ? వాడి మాట అటుంచుందాం ఆ చుంచన్న మాటకేం ! దానిముందు ?

.... .... .... .... ....

# మొజామ్ తుడుపు

ఎన్నాళ్ళనుంచి పట్నం వీధులు తుడుస్తూన్నా భీముడుగాడి యిల్లూవాకిలీ భీముడుగాడి పిల్లాపీచూ పట్నంలోని పైవర్ణాల వాళ్ళకు తెలియదు. భీముడుగాడు కడజాతివాళ్ళల్లో కడజాతి వాడు. చేసేపని చినుపాటుగించి మునిసిపాలిటీవీధులు తుడవడమే.

వీధులు తుడుచేవాడని మనము వాణ్ణి నిరసనభావంతో చూడ వలసిన పనిలేదు. గాలి తుడువదూ వీధుల్ని? గాలిని పవిత్రంగా భావించడంలేదు? యటువంటివాడే భీముడున్ను.

మొన్నటి మే 15 వ తేదీనాటికి వాడికి డెబ్బైయయిదు వెళ్ళి డెబ్బైయారోయేడు వచ్చింది. వాణ్ణి యడిగితే వాడు తన వయస్సు చెప్పడు. వాడి ముఖాన్నిబట్టి ఆలోచించి అంచనాగట్టి సరిగా వేశాననుకోండి. 16 ళ తేదీ మధ్యాహ్నం ఎండకు వడగొట్టి ఆ వృద్ధుడు రాజమార్గాని క్కా_స్త అనుకుంటావున్న గంగరావిచెట్టుసీడను పడిపోయినాడు. యప్పుడే యక్కడకో చిన్నపిల్ల-చిన్నపిల్లేంలేండి! పదిహేడు పద్దెన్మిదేండ్లుంటాయి— ఆ ముసిలివానిముందు చిన్నపిల్లగా యగపించిందికాని—వచ్చి నిలబడి—"తాతా! తాతా!" అని పిలిచింది. వాడు చేత్తో— "కూసిన్నీళ్ళు" యన్నట్టు సంజ్ఞచేసినాడు. పక్కనేవున్న కుళాయిదగ్గరకెళ్ళి పిల్ల దోసెడునీళ్ళుతెచ్చి ఆ ముసిలివాని ముఖాన్న చల్లింది. వాడి ముఖం కా_స్తంత తేరింది. "అమ్మా! ఈ యెండలో నడిచొచ్చావా? నే రానూ ఇంటికీ!" అంటూ దానిబుజమ్మీద ఒకచేయి ఆనుకొని రెండోచేత చీపురుచ్చుకు చీపు రీడ్చుకుంటూ పోయేడు.

పోతూ దారిలో అంటాడు పిల్లతో—"గురమ్మబిడ్డా! గురమ్మబిడ్డా! ఈయేలకే యీబాధ నాకు. రేపట్నుంచి *'మోజాం' లో చెట్లక్రింద తుడవమన్నారు 'వార్డు' ఇంట్రోతు గారు" అన్నాడు. గురమ్మ అంది—"తాతా! ఈయేలదాఁకా రాకపోతే నిజంగా వడగొట్టి ఎక్కడో పడిపోయేవే యను

కున్నాను తాతా ! నేను " అంది. భీముడు అన్నాడు—" మరి వడకొట్టి పడిపోలేదు మరి ? నీవు రాకపోతే మరో ఘడియకు చచ్చేపోదును. ఈపొద్దు పొద్దొడవకుండానే చిట చిట లాడేసింది వొళ్ళు చూడు. గురమ్మబిడ్డా ! నీవెందుకొచ్చావు ఈయెండలో ? నేను వడగొట్టి చచ్చినా లోకానికి దండగలేదు. నీవు దారిలో వడగొట్టిపడిపోతివా ? అయ్యో! నాబిడ్డా !" అని తన కళ్ళమ్మట నీరుగారినంత పనిగా తుడుచుకొని గురమ్మ ముంగురు లెగ దువ్వుతూ మంచి మట్టమధ్యాహ్నపు ఎండలో వెన్నెల్లోనా అన్నట్టు జోడులేకుండా గొడుగులేకుండా నడిచేడు భీముడుగాడు. వాడికూడా వెడుతూన్నది గురమ్మ కుర్రదికూడా.

వాళ్ళిల్లు చాలాదూరం. వాడు పడిపోయిన గంగరావి చెట్టుకూ వాళ్ళ గూడెంకొడకూ కాకిని గంతేయించినా మూడు మైళ్లు ; అవన్నీ తాటాకు గుడిసెలు వాడూ వాళ్ళవాళ్ళూ వుండే యిళ్లు. అవన్నీ ఆ కొంపలన్నీ అంతదూరాన్న భీముడు గురమ్మ ఉండంగానే రంయిని యంటుకొని అమ్మో బావో అని ఆడవాళ్ళు పిల్లలు కోళ్ళు గొడ్లు ఇవతల పడేటట్టు మంటలు రయిగప్పి భస్మీపటలం అయిపోయాయి. వెళ్ళి వెళ్ళి నిర్ఘాంత పడిపోతూ నిలబడిపోయినారేకాని భీముడుగాడుగాని గురమ్మ పిల్లగాని వాళ్ళ గుడిసెలోనుంచి వొక్కపూతికపుడకైనా యివ లకు తీసుకోలేకపోయినారు.

ఆ విషాద దృశ్యాన్ని నేను వర్ణించేకంటె కర్ణాకర్ణిగా వింటే ఎక్కువ కరుణ ఎక్కువ కనికరం ఉదయిస్తుందను కుంటాము, కలిమిగలవాళ్ళ గుండెల్లో. అడిగి చూడండి వాళ్ళు వద్ద అనాటిబాధ !

భీముడుగాడు, అమంటా, అమంటలో ఒక్కొక్క కుక్క, ఒక్కొక్క కోడి, ఒక్కొక్క పంది మల మల మాడి పోతూ వుండడం, మనుష్యులుమాత్రం తమ ప్రాణాలు తమకు తక్కినందుకు సంతోషించడం అంతా అసురసంజదాకా చూచేడు చూచేడు. చూచి గురమ్మ పిల్లను కూకేశేడు. " మనమింక ఈ రేత్రికి ఇక్కడ వుండలేమే బుల్లీ ! మళ్ళీ మనం ఇల్లు కట్టాలేము. తెల్లాటి ఎల్లాగు మోజాం తుడవాలికదా ! రా ! అక్కడే మాపటికికూడా తొంగుదుంది మఱి రేపటి పొద్దాలో చిద్దాం " అన్నాడు ; పయన మయ్యేరు.

తెల్లారితే తుడిచేవాడు వాదే కాబట్టి మోజాం తలుపులు వాణ్ణి అడ్డుకోలేదు. వాడూ గురమ్మపిల్ల తిన్నగా ఆ రేత్రి ఆమోజాంలోనే నిదరోయినారు. తాతా మనుమరాలూ ! ఎవ రనుమానిస్తారు ? అనుమానించడానికేముంది ? తెల్లాఱింది. తెల్లారి చూచేసరికి వాళ్ళు రాత్రి పడుకున్నది పొగడచెట్టుగా కనిపించింది. ఆ చెట్టుక్రింద అన్నీ పువ్వులే. వాడి రాలివున్నాయి. " ఈ పువ్వులా తాతా ! తుడిచేవేదీ ఈ మోజాంలో ?" అని యడిగింది మొదటిప్రశ్నగా గురమ్మబిడ్డ. " అవునమ్మా ! ఇవే! ఏం అలాచూస్తావు ?" అన్నాడు తాత. " ఇలాంటి పూల దండలు రోజూ రెండూ మూడూ తెచ్చి నాకిచ్చీవాడవే ! ఆ పూవులేన్నే తుడిచేస్తానంటావేమిటి ?" అంది ఓ నాదు పువ్వు మళ్ళా వాసనచూస్తూ గురమ్మ. " అమ్మా !" అన్నాడు భీముడు గాడు, " వీధులు రస్తాలు తుడుస్తూంటే రాత్రల్లా తలల్లో పెట్టు తువి ఇవల పారేసిన అమ్మలక్కల తలల్లోని వాడు పూల దండలు తుక్కులోనూ చెత్తలోనూ కనిపిస్తే, పోనియ్యాడ

మెందుకని దుమ్ముదులిపి నీకు తెచ్చి యిచ్చేవాణ్ణి. యవే నీకు యపురూపమై నీగ్గుండెకాయలా గ్గైపోయినయి. మరిచిపోలేదు" అన్నాడు భీముడుగాడు. గురమ్మ "ఊఁ" అంది ఓ మతో వాడుపువ్వును మొదటిదానికి జతచేసి చూస్తూ. భీముడుగాడు—"అమ్మా! చూడు! ఇక్కడ మనకు చెట్టుమీద మంచిపువ్వులే దొరుకుతయి. ఈ వాడుపువ్వుల జోలి ఇక అక్కరలేదు. ఇవి నే తుడిచేస్తూంటాను. అరుగో బంట్రోతయ్యలు వచ్చారంటే ఇంకా తుడవలేదేం యంటార" ని అంటూ తుడిచేడు భీముడు గాడు. గురమ్మ చెట్టుకేసి చూచింది. భేషైనపువ్వులు విరిసి గుమ్మని పిసాళిస్తూ వృంతం పటుత్వంతో కనిపించేయి. "అయితే చెట్టెక్కి యవి కోసుకుంటా" నంది. "కోసికో!" అన్నాడు భీముడుగాడు. గురమ్మ చెట్టెక్కి, కోసి కోసి దండగా దండగా పూలు గుచ్చుకు తల్లో పెట్టుకుంటూ ఆ చెట్టు మీదనుంచే భీముడుగాడితో అంటూంది—"తాతోయి! యిలా! నే మంచిపువ్వులు కోసికొంటూ కొత్తపువ్వులు తల్లో పెట్టు కుంటూంటే నీకు విశ్రాంతికూడాను తాతోయి! చెట్టుక్రింద నీవు తుడువనక్కరలేదు. వాడుపూలు చెట్టుక్రిందరాల" వంది పెద్దగా నవ్వుతూ.

అంతలోనే బంట్రోతయ్యవచ్చి—"ఎవరాచెట్టుమీద?" అన్నాడు. భీముడుగాడు—"మాపిల్ల గురమ్మ" అన్నాడు. గురమ్మ గబుక్కున చెట్టుదిగి తనసిగలో దండ బంట్రోతుకు తెలీకుండా ఇవతలకుతీస్తూ—"తాతోయి! ఈ మంచిదండ ఆ బంట్రోతయ్యగారి కోసమని చెప్పు" అంది. బంట్రోతు అప్పుడే అలా పోతూవున్నాడు ఆపెడ కెవర్నో చూచి. "బంట్రోతుగారికికాదే. అరుగో పొద్దున్నే ఛేర్మెన్‌గారే ఇలా

షికారుగా వస్తున్నారు. వారికియ్యి సినేమాను " అన్నాడు. భీముడుగాడు.

ఛేర్‌మేన్‌గారు అలా వచ్చివచ్చి నిలబడి-"ఏం భీముడూ! నీ కి ప్రొమోషన్ ఎలావుంది ?" అన్నాడు. గురమ్మ దండ యందిచ్చింది. ఛేర్‌మేన్ దండచ్చుకు వాసనచూస్తూ-" దానిచేత తుడిపిస్తున్నావా ఏమిటి నీవు తుడవలేక మోజా ?" అన్నాడు. భీముడుగాడు-" ఏలినవారి దయవుంటే లేదండి ! అసలది వాడు పూలే తుడవదండి కొత్తపూలు ముణుద్దిగాని. నాకు మనమ రాల్లేండి. సెలవండి దొరగారూ !" అన్నాడు. ఛేరుమేన్ గురమ్మ సిగకేసిచూస్తూ విస్తుపోతూ వెళ్ళిపోయినాడు.

భీముడుగాడు మనమరాల్ని దగ్గఱకు తీసుకుంటూ—" నీసిగకేసి చూచిన చూపు నా కాలిపోయిన గుడిసెకేసి చూచి వుంటే బాగుండిపోయాదే మనబతుకు, ఈ ప్రభువులు చూడరే?" అంటూ ఇంతసే పేడ్చినాడు. వాడికప్పుడు జ్ఞాపకం వచ్చింది క్రితంరోజున కాలిపోయిన గుడిసె అంతా చక్షుసాక్షిగా. గురమ్మ-" తాతా ! నీవు తుడిచేసిన వాడుపూవు లేవీ ? ఎక్కడకు పోగు చేసినావు ?" అంటూ పోయింది దూరదూరంగా ! పెద్దగాలి వేస్తే బాగుండిపోను; అన్నిపువ్వులు రాలిపోతే బాగుండిపోను." యని అనుకుంది తన హృదయంలో. అదే సంఘవిప్లవ మయిపోయింది.

.... .... .... .... ....

## పాడడిపోతావున్న కోటిలింగాలు

విశేషాలనడంతోనే అందరికీ అతీ సుందరమైందీ, అతీ యద్భుత మైందీ, అతీ వినూతనమైందీ, అతీ యభివృద్ధిలో మున్నదీ,